క్లుప్తంగా

5న జీవన విద్యపై వర్క్‌షాప్

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ప్రాంగణంలో 'జీవన విద్య' అనే అంశంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. నవంబర్ 5వ తేదీ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. జీవితాన్ని ఆనందమైన, అర్థవంతమైన ప్రయాణంగా మార్చుకోవడానికి , సంతృప్తికరమైన జీవనంగా మార్చుకునేందుకు అవకాశం కల్పించేలా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాల కోసం వాసు 9849285628, శ్రీనివాస్ 9948885111లో సంప్రదించాలని వారు కోరారు.

వైభవంగా తుల్జాభవాని ఊరేగింపు



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి తారానగర్‌లో శ్రీ తుల్జా భవానీ అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం మంగళవారం కన్నుల పండువగా నిర్వహించారు. తారానగర్ సాయిబాబ ఆలయం, పోచమ్మ దేవాలయం వరకు అమ్మవారిని యువకులు నృత్యాలు, మహిళల కోలాటంతో ఊరేగించారు. స్థానికులు అమ్మవారికి పూజలు నిర్వహించారు.

ఏబీవీపీ ఆందోళన



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. చెన్నయ్‌లో జాతీయ పతాకానికి జరిగిన అవమానాన్ని నిరసిస్తూ సోమవారం రాత్రి ఆందోళన చేశారు. తమిళనాడు ప్రభుత్వం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్లకార్డులు పట్టుకొని, నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో పలువురు హెచ్‌సీయూ ఏబీవీపీ నాయకులు, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీబీ అడ్వైజరీ గ్రూపు సభ్యుడిగా ప్రొ.సారంగ్ డియో



రాయదుర్గం: ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) ప్రొఫెసర్ సారంగ్ డియోకు అరుదైన అవకాశం కలిగింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ద్వారా క్షయవ్యాధికి సంబంధించిన వ్యూహాత్మక, సాంకేతిక సలహా బృందం(ఎస్‌టీఏజీ) సభ్యునిగా నియమించింది. ఆయన ప్రస్తుతం ఐఎస్‌బీలో ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్‌గా, ఫ్యాకల్టీ అండ్ రీసెర్చ్ డిప్యూటీ డీన్, మాక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వివిధ హోదాలలో పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

అక్తర్ హుస్సేన్‌కు పీహెచ్‌డీ

రాయదుర్గం: మనూ పరిశోధక విద్యార్థి అక్తర్ హుస్సేన్‌కు మంగళవారం పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. ఆయన విశ్వవిద్యాలయంలోని సోషల్ వర్క్ విభాగంలో పరిశోధక విద్యార్థి. 'ముస్లింల జీవితాలపై విద్య ప్రభావం: హైదరాబాద్ నగరం యొక్క అధ్యయనం' అనే అంశంపై థీసిస్ సమర్పించారు. ప్రొఫెసర్ ఎండి షాహిద్‌రజా, ఆగ్రాలోని డాక్టర్ బీమ్‌రావ్ అంబేడ్కర్ యూనివర్శిటీ డాక్టర్ మొహద్‌హుస్సేన్ సహ పర్యవేక్షణలో పీహెచ్‌డీని పూర్తి చేశారు.

చందానగర్‌లో రూ.28 లక్షలు సీజ్



హఫీజ్‌పేట్ : చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంగారం ట్రాఫిక్ సిగ్నల్ వద్ద రవికుమార్ అనే వ్యక్తి వాహనంలో 28 లక్షల 9వేల 519 రూపాయలు తరలిస్తుండగా ఎస్‌ఓటీ, చందానగర్ పోలీసులు గుర్తించారు. డబ్బుకు సంబంధించిన సరైన పత్రాలు చూపించకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. అనంతరం సీజ్ చేసిన డబ్బును ఎన్నికల అధికారులకు అప్పగిస్తామని సీఐ పాలవెల్లి తెలిపారు.

ముమ్మర తనిఖీలు

మాదాపూర్ అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో చందానగర్ శ్రీదేవి థియేటర్, అమీన్‌పూర్ రోడ్డులో ఇన్‌స్పెక్టర్ పాలవెల్లి, ఎన్నికల అధికారులు, ప్రత్యేక టీంలతో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాహనాల తనిఖీ చేస్తున్నట్లు డీసీపీ నర్సింహారెడ్డి పేర్కొన్నారు.



మహిషాసురమర్దినిగా రాజరాజేశ్వరిమాత



అన్నపూర్ణాదేవి



గచ్చిబౌలి డివిజన్‌లో.. కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి తదితరులు



రాయదుర్గం ఊరపోచమ్మ ఆలయంలో..

మహిషాసురమర్దినిగా అమ్మవారు

ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

రాయదుర్గం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు మంగళవారం మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చారు. దసరా సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పూజలు, చండీహోమం, కుంకుమ పూజ, ప్రసాద వితరణ చేశారు. భక్తిశ్రద్ధలతో శమీపూజ నిర్వహించారు. కాగా కొన్నిచోట్ల సోమవారం, మరి కొన్నిచోట్ల మంగళవారం ఉత్సవాలు ముగిశాయి.

రావణ దహనం

రాయదుర్గం/శేరిలింగంపల్లి: దసరా ఉత్సవాలలో సోమవారం రాత్రి రావణ దహన కార్యక్రమాలు అంగరంగవైభవంగా నిర్వహించారు. గచ్చిబౌలి ఇందిరానగర్‌లోని ఇంటర్నేషనల్ శ్రీహనుమాన్ ధామ్ ఆశ్రమం (ఐఎస్‌హెచ్‌డీఏ)లో, అలాగే శేరిలింగంపల్లి డివిజన్‌లోని హుడా ట్రేడ్ సెంటర్‌లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకుల పర్యవేక్షణలో శమీ పూజ చేశారు. అనంతరం రావణ దహన కార్యక్రమాన్ని స్థానికుల సమక్షంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ ప్రారంభించారు.



లింగంపల్లిలో శమీ పూజలో.. ఎమ్మెల్యే గాంధీ, స్థానికులు



హుడా ట్రేడ్ సెంటర్‌లో రావణ దహనం కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ తదితరులు





ఇందిరానగర్‌లో..



హుడా ట్రేడ్ సెంటర్‌లో ..



ఎదురుగడ్డ మైసమ్మ ఆలయంలో హోమం

ఘనంగా లక్ష పుష్పార్చన

సాయిదత్త గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు

రాయదుర్గం: టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో రెండురోజుల ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. సోమవారం ఉదయం షిర్డీ సాయిబాబాకు కాగడ హారతితో ఉత్సవాలు ఆరంభమయ్యాయి.అనంతరం పంచామృతాభిషేకం, అష్టోత్తరములు, విష్ణు సహస్రనామం, లలితా సహస్రనామం, సాయిగీత మాలిక, మధ్యాహ్నం హారతి, సాయి చాలీసా వంటి కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. రాత్రి ఆలయంలో భజన బృందం చే ప్రత్యేక భజనలను నిర్వహించారు. మంగళవారం లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.



శేరిలింగంపల్లిలో అలయ్ బలయ్



అలయ్ బలయ్ కార్యక్రమంలో పాల్గొన్న లేగల కుటుంబ సభ్యులు



కర్ణాటక కళాకారుల ప్రదర్శన


శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలో విజయదశమిని పురస్కరించుకొని లేగల ఫ్యామిలీ ఆధ్వర్యంలో అలయ్ బలయ్ కార్యక్రమాన్ని సోమవారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ లేగల వెంకట్ రెడ్డి ప్రారంభించారు. అంతకు ముందు లింగంపల్లి విలేజ్ నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకొని జమ్మిచెట్టుకు పూజ చేశారు. యువకుల నృత్యాలు, కర్ణాటక కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో లేగల కుటుంబ సభ్యులు నర్సింహారెడ్డి, రమేష్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, లింగంపల్లి విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ ప్రతినిధులు కె.ఎల్లేష్, దేవులపల్లి శ్రీనివాస్, కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శమీ పూజలో ప్రముఖులు

పటాన్‌చెరు టౌన్: దసరా పండగను పురస్కరించుకొని పటాన్‌చెరు పట్టణంలోని మైత్రి స్టేడియంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన దసరా సంబరాల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొని, జీహెచ్‌ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ వద్ద నిర్వహించిన శమీ పూజలో పాల్గొన్నారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, పురప్రముఖులతో కలిసి మైత్రి స్టేడియంలో నిర్వహించిన రావణా దహన కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చెడుపై మంచి సాధించిన విజయానికి దసరా గుర్తు అని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు సత్యనారాయణ, నందీశ్వర్‌గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, సపానదేవ్, పట్టణ పుర ప్రముఖులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం , భారతినగర్ డివిజన్, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో పలు ఆలయాల్లో జమ్మి పూజ నిర్వహించారు. భారతినగర్, రామచంద్రాపురం డివిజన్లలో కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి, పుష్ప నగేష్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం వేర్వేరుగా రావణ దహనకాండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ రాష్ట్ర శాసన మండలి చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్‌లో నిర్వహించిన రావణదహన కాండ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మల్లెపల్లి లలిత సోమిరెడ్డి పాల్గొన్నారు.



'ఇట్ ఈజ్ నాట్ జస్ట్' చిత్ర ప్రదర్శన

మాదాపూర్: చిత్ర కళాకారిణి సవిత లక్ష్మణన్ వేసిన చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో ఏర్పాటు చేసిన ఇట్ ఈజ్ నాట్ జస్ట్ పేరిట నిర్వహిస్తున్న చిత్రప్రదర్శన సందేశాత్మంగా ఉందని కళాకారులు కొనియాడుతున్నారు. ఈనెల 29వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో 38 చిత్రాలు ప్రదర్శనలో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.





నృత్య ప్రదర్శన

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న ఆలిండియా శారీమేళాలో భాగంగా మంగళవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శ్రీలత శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన అలరించింది. ఇందులో గణపతి, సరస్వతి పూజ, మీనాక్షి పంచరత్న, తీరు తీరు జవరాల, రాజేశ్వరీ అష్టకం అంశాలను హరిత, శ్రీసంస్కృతి, ప్రవల్లిక, నిగమ, కీర్తన, అన్విత, మరుషిక, మహతి, మనస్విలు ప్రదర్శించారు.

బస్తీ దవాఖాన.. సౌకర్యాలు నిల్



ప్రేమ్‌నగర్ బస్తీ దవాఖానా

హఫీజ్‌పేట్ : బస్తీ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం నూతనంగా బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసింది. ఈ దవాఖానాలు కరోనా విపత్కర పరిస్థితుల్లో ఎంతో ఉపయోగపడ్డాయి. కాగా కొండాపూర్ డివిజన్ పరిధిలోని న్యూహఫీజ్‌పేట్ ప్రేమ్‌నగర్ బస్తీలోని కమ్యూనిటీ హాల్‌లో ప్రారంభించిన బస్తీ దవాఖానాలో వైద్యులు, రోగులకు కావలసిన కనీస వసతులు కల్పించలేదు. ఈ దవాఖానాలో ఒక డాక్టర్, ఇద్దరు నర్సులు విధులు నిర్వహిస్తున్నారు. మంచినీటి కనెక్షన్, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, శిథిల దశకు చేరిన ప్రహరీ తదితర సమస్యలు నెలకొన్నాయి. వీటిని పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

సమస్యలు ఇవే..

- ఇష్టానుసారంగా దవాఖానాలో వాహనాలను పార్క్ చేస్తున్నారు.
- కుళాయి నీరు రావడం లేదు.
- మంజీరా మంచినీటి పైప్‌లైన్ లేకపోవడంతో ట్యాంకర్ ద్వారా నీళ్ళు అందిస్తున్నారు.
- దవాఖానా చుట్టు ప్రహరీ బీటలు వారి కూలిపోయింది.
- బస్తీ వాసులు ప్రధాన గేటు వద్ద చెత్త చెదారం వేస్తున్నారు.
- రాత్రి సమయాలలో ట్రాక్టర్ల ద్వారా దవాఖానా ఆవరణలో మట్టిపోస్తున్నారు.
- ప్రహరీ చుట్టు పిచ్చి మొక్కలు పెరిగి దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి.
- మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి.



దవాఖానాలో వేసిన మట్టి కుప్పలు



శిథిలావస్థకు చేరిన ప్రహరీ

కనీస వసతులు కల్పించాలి



జీహెచ్‌ఎంసీ అధికారులు బస్తీ దవాఖానాలో వెంటనే వసతులు కల్పించాలి. ప్రజాప్రతినిధులు దవాఖానా అభివృద్ధి కోసం నిధులు మంజూరు అయ్యాయంటున్నారు. కానీ పనులు ఎందుకు ప్రారంభం కావడం లేదో తెలియడం లేదు.

–ఉస్మాన్, ప్రేమ్‌నగర్ బస్తీవాసి

ట్యాంకర్ల ద్వారా నీరు



బస్తీ దవాఖానాకు మంచినీటి కనెక్షన్ ఇవ్వకుండా ట్యాంకర్ల ద్వారా నీరు అందించడం విడ్డూరంగా ఉంది. ఆవరణలో మట్టి కుప్పలు, పిచ్చిమొక్కలతో నిండింది. ఇప్పటికైనా పారిశుద్ధ్య కార్మికులు దవాఖాన పరిసరాలను శుభ్రం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సయ్యద్ ఇఫ్తికార్ అహ్మద్, ప్రేమ్‌నగర్ వాసి